క్లుప్తంగా

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఈనెల 25వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కంకిపాడులోని అయానా ఫంక్షన్ హాలులో నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ కార్యాలయ వర్గాలు బుధవారం వివరాలు తెలిపాయి. రాష్ట్ర మంత్రి జోగి రమేష్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

యోగా ట్రైనర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన యోగా శిక్షకుడు పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి పి.మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. యోగా శిక్షణలో అనుభవం ఉన్న పురుష అభ్యర్థి అర్హుడన్నారు. రోజుకు గంట చొప్పున నెలకు 32 గంటలు పని చేయాలని తెలిపారు. నెలకు రూ.8 వేల గౌరవ వేతనం ఇస్తామని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 98496 54641 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఉయ్యూరు: లోక్ అదాలత్‌ను వినియోగించుకుని రాజీ మార్గంగా కేసులను పరిష్కరించుకోవాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.శ్రీహరి కోరారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మార్చి 19న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలతో ఉయ్యూరు కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. న్యాయస్థానం పరిధిలోని కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులను తక్షణం పరిష్కరించుకోవాలని సూచించారు.

భర్తపై వరకట్నం వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తూ భార్యను శారీరకంగా హింసకు గురి చేస్తున్న భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకికి చెందిన ఉయ్యూరు కీర్తి బీటెక్ చదువుతుంది. ఆమె ఇబ్రహీంపట్నంకు చెందిన తెనాలి ఆనంద్ అనే వ్యక్తిని ప్రేమించింది. ఇరువురు పోలీసుల సమక్షంలో 2022వ సంవత్సరం ఆగస్టు 22వ తేదీన వివాహం చేసుకున్నారు. ఆనంద్ కొద్ది కాలం సజావుగానే కాపురం చేశాడు. అనంతరం ఆనంద్ దురలవాట్లకు బానిసగా మారి కీర్తిని కట్నకానుకలు తీసుకురావాలని వేధిస్తున్నాడు. మద్యం సేవించి వచ్చి కీర్తిని విచక్షణారహితంగా దాడి చేస్తూ హింసకు గురి చేయసాగాడు. పక్కింటి వారి ఫోన్‌తో తల్లిదండ్రులకు కీర్తి సమాచారం ఇవ్వటంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను అత్తింటి నుంచి తీసుకు వచ్చి పుట్టింట్లో అప్పగించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలవరం కాలువలో మృతదేహం గుర్తింపు

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారులో పోలవరం కాలువలో ఓ వ్యక్తి మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. పోలీసుల సమాచారం ప్రకారం.. పోలవరం కాలువలో తేలుతున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగరాజు నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. మృతుడు ఆగిరిపల్లి మండలంలోని అడవినెక్కలంకు చెందిన బొద్దు శ్యామ్(50)గా పోలీసులు గుర్తించారు. గతంలో ఓ కెమికల్ కంపెనీలో పనిచేసిన శ్యామ్ గత ఆరు నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో పోలవరం కాలువలో అతని మృతదేహం దొరకడంతో పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు కాలువలో పడ్డారా, లేక ఆత్మహత్య చేసుకున్నారా అనే కోణంలో విచారణ చేపట్టారు.

ఆడుదాం ఆంధ్రాలో | క్రీడాకారులు సత్తాచాటాలి

- ఆర్డీఓ రాజు
- అట్టహాసంగా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ప్రారంభం



కానూరులో కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీఓ రాజు, డీన్ పాండురంగారావు



గన్నవరంలో ఖోఖో జట్టుతో ఝాన్సీలక్ష్మి తదితరులు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఆర్డీఓ డి.రాజు అన్నారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో బుధవారం ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో పెనమలూరు నియోజకవర్గం ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను బుధవారం ఆర్డీఓ రాజు ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావటానికి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. క్రీడాకారులకు సత్తా చాటడానికి ఇది చక్కని అవకాశమని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులకు విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనటానికి ఫ్రాంచైజ్‌లు ముందుకు వచ్చి క్రీడాకారులను ఎంపిక చేసుకుంటాయన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన వారికి రూ.35 వేలు, రెండో స్థానం వచ్చిన వారికి రూ.15 వేలు, మూడో స్థానం పొందిన వారికి రూ.5 వేలు చొప్పున ప్రైజ్ మనీ ఇస్తారన్నారు. కాలేజీ డీన్ బావినేని పాండురంగారావు మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనటం వలన ఉత్తేజంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం క్రీడాకారులకు చక్కని అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టీ షర్టులు అందజేత

పెనమలూరు: గోసాల గ్రామంలో వాలీబాల్ క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ సంగెపు శ్రీనివాసరావు బుధవారం టీ షర్టులు అందజేశారు. ఇటీవల జరిగిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో గోసాల జట్టు వాలీబాల్‌లో విజేతలుగా నిలిచారు. క్రీడాకారులను ప్రోత్సహించటానికి జట్టులో ఉన్న 9 మంది క్రీడాకారులకు టీ షర్టులు అందించారు. క్రీడాకారులు ఉత్తమ ఆటను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాలని సర్పంచ్ శ్రీనివాసరావు ఆకాంక్షించారు.

గన్నవరంలో క్రీడా సంబరాలు

గన్నవరం: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలు స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత పురుషుల క్రికెట్ పోటీలను ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకాధికారి మహ్మద్ హాజీ బేగ్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం హోరాహోరిగా జరిగిన మ్యాచ్‌లో ఉంగుటూరు జట్టుపై బాపులపాడు జట్టు ఘన విజయం సాధించింది. పురుషుల ఖోఖో విభాగంలో పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో ఉంగుటూరు జట్టుపై గన్నవరం జట్టు విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ జట్టు జిల్లా స్థాయి పోటీలకు నియోజకవర్గం నుంచి ఎంపికైనట్లు హాజీ బేగ్ తెలిపారు. గురువారం నుంచి వాలీబాల్, బ్యాడ్మింటన్ డబుల్స్, కబడ్డీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, ఈఓపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, ఎంఈఓ-2 కమల్, హెచ్ఎం ఎస్.రవీంద్రభవాని, పంచాయతీ కార్యదర్శులు బాపూజీ, సీహెచ్ అనిల్‌కుమార్, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త డి.నాగరాజు, కేవీఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్, మూడు మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి, క్రీడా స్ఫూర్తి, శారీరక, మానసిక వికాసానికి ఈ ఆటల పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి, ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, ఎంఈఓ శ్రీరామ్ బాలసింగ్, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, పలువురు వ్యాయామోపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ విజేత పెనమలూరు జట్టు



కబడ్డీలో గెలిచిన పెనమలూరు జట్టు

పెనమలూరు: ఆడుదాం ఆంధ్రా పెనమలూరు నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో పెనమలూరు జట్టు కబడ్డీ విజేతగా నిలిచింది. కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో పెనమలూరు సచివాలయం - 3 జట్టు ఉయ్యూరు జట్టుపై 21-17 స్కోర్ తేడాతో విజయం సాధించింది. మూడో స్థానంలో కంకిపాడు, నాల్గవ స్థానంలో వైఎస్సార్ తాడిగడప జట్లు ఉన్నాయి. కబడ్డీ మహిళల పోటీలో ప్రథమ స్థానం ఉయ్యూరు, రెండో స్థానం కంకిపాడు, మూడో స్థానం వైఎస్సార్ తాడిగడప మున్సిపాలటీ జట్లు గెలుపొందాయి. షటిల్ పురుషుల పోటీల్లో కంకిపాడు ప్రథమ స్థానం, పెనమలూరు రెండో స్థానం, వైఎస్సార్ తాడిగడప మూడో స్థానం గెలిచాయి. షటిల్ మహిళల పోటీలో పెనమలూరు ప్రథమ స్థానం, ఉయ్యూరు రెండో స్థానం, కంకిపాడు మూడో స్థానం గెలిచాయి. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లు జిల్లా స్థాయిలో జరగనున్న పోటీలో పాల్గొంటాయని ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తెలిపారు.

కులగణన వేగంగా చేపట్టాలి



కానూరులో మాట్లాడుతున్న అధికారులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో కులగణనను వేగవంతంగా చేపట్టాలని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సాహిద్‌బాబు తెలిపారు. కానూరులో బుధవారం సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. మరో నాలుగు రోజుల్లో ముగుస్తున్నందున జాప్యం చేయకుండా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది వేగంగా సర్వే చేపట్టాలన్నారు. కులగణన విషయంలో నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. మున్సిపాలిటీలో కులగణన సర్వే పురోగతి పెంచాలన్నారు. సిబ్బంది చేపట్టాల్సిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఆర్డీఓ డి.రాజు మాట్లాడుతూ.. కులగణనపై సచివాలయాల సిబ్బంది అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. సకాలంలో కులగణన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.మోహన్‌రావు, డీఎల్‌డీఓ నాంచారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు సెంట్రల్ లాగిన్‌లో నమోదు చేయాలి

నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలను కేంద్ర ప్రభుత్వ లాగిన్‌లో త్వరితగతిన నమోదు చేయాలని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి -2 సూరిబాబు తెలిపారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ.. విజయవాడ రూరల్ మండలంలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు మొత్తం 36 వేల మంది ఉన్నారన్నారు. వారి వివరాలను సాధ్యమైనంత త్వరగా కేంద్ర ప్రభుత్వ లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయవాడలో 144 సెక్షన్

విజయవాడస్పోర్ట్స్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు విజయవాడ సిటీ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం నుంచి 50 రోజుల పాటు 144(2) సీఆర్‌పీసీ కింద నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్‌టౌన్, టూ టౌన్, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. నలుగురు, అంతకు మించి వ్యక్తులు ఒకే ప్రదేశంలో గూమిగూడినా, కర్రలు, ఇతర మారణాయుధాలతో సంచరించినా, నిబంధనలను అతిక్రమించినా శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికల హక్కులపై అవగాహన అవసరం



కానూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

పెనమలూరు: కానూరులో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 24వ జాతీయ బాలికల దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో విద్యార్థినులు పాల్గొన్నారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, సమాన అవకాశాలు, హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, వివక్ష, బాలికలపై హింస వంటి సమస్యలు ఎలా పరిష్కరించాలో తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ర్యాలీలు



గోపవరపుగూడెం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో బాలికలను రక్షించుకుందాం -వారి హక్కులను కాపాడుదాం అంటూ ర్యాలీలు చేశారు. అనంతరం ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి బాలిక విజ్ఞానం, విద్యతో సాధికారిత సాధించాలని చెప్పారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలను తొలగించాలని కోరారు. బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యత పట్ల అవగాహన పెంపొందించాలని సూచించారు. అనంతరం సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మాదలవారిగూడెం సర్పంచ్ బుద్దాల లక్ష్మీ ప్రసన్న, మహిళా సంరక్షణ కార్యదర్శి టి.సత్యవాణి, పలువురు ఉపాధ్యాయులు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగోళి పోటీలు



పెనమలూరు: 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మహిళలకు రంగోళీ పోటీలను పెనమలూరులో బుధవారం నిర్వహించారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలను ఆర్డీఓ డి.రాజు ఆధ్వర్యంలో జరిపారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పెనమలూరుకు చెందిన బి.భాగ్యంకు ప్రథమ బహుమతి, రెండో స్థానం పి.పద్మజ, మూడో స్థానం పి.నాగలక్ష్మి, నాల్గవ స్థానం ఎస్.భవాని, ఐదో స్థానం ఎం.అర్చన గెలుచుకున్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం 30 మంది వృద్ధులకు, 25 మంది బూత్ లెవల్ అధికారులకు సన్మానం, ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ చేస్తామన్నారు. ముగ్గుల పోటల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ట్యాబ్‌లతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు, సభ్యులు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 130 మంది విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా నాడు - నేడు, మన బడి పథకం కింద మౌలిక సదుపాయాలు కల్పించడం, అమ్మ ఒడి, జగనన్న విద్యా కిట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యనభ్యసించి స్కూల్‌కు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను ప్రతి రోజు స్కూల్‌కు పంపాలని, ట్యాబ్‌లను సద్వినియోగం అయ్యే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు సైదాబీ, బొట్టా అరుణకుమారి, విద్యా కమిటీ సభ్యులు గడ్డం కుమార్, షేక్ నాగూర్‌బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఉయ్యూరు ఎస్ఈబీ సీఐ వెంకటలక్ష్మి

ఉయ్యూరు: మాదక ద్రవ్యాలను దరిచేరనీయొద్దని ఎస్ఈబీ ఉయ్యూరు సీఐ జి.వెంకటలక్ష్మి అన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఉయ్యూరులోని శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల ప్రాంగణంలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థులు, యువత, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మానవ జీవితాలను దుర్భరం చేసే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. 60 మంది విద్యార్థులతో యాంటీ డ్రగ్ డిక్లరేషన్ ఫారాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్‌రావు, విద్యాసంస్థల అధినేత డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఆర్టీసీ డ్రైవర్స్ డే



ఉయ్యూరులో డ్రైవర్లను అభినందిస్తున్న జిల్లా ప్రజారవాణా అధికారి వాణిశ్రీ

ఉయ్యూరు: ప్రయాణికుల భద్రతే ప్రధానంగా డ్రైవర్లు పనిచేయాలని జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. డిపో పరిధిలోని 25 మంది ఉత్తమ డ్రైవర్లకు వాణిశ్రీ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని డిపోల్లో ఉన్న ఉత్తమ డ్రైవర్లను గుర్తించి అభినందిస్తున్నామని చెప్పారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చటమే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తున్నామన్నారు. బస్సు నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తతతో బాధ్యతను గుర్తెరిగి విధులు నిర్వర్తించాలని కోరారు. ఉయ్యూరు డిపోకు త్వరలో కొత్త సర్వీసులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్య పరిరక్షణ



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న రాజేష్‌కుమార్

ఉయ్యూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు అన్నారు. పట్టణంలోని జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్ - 2 కార్యక్రమంలో భాగంగా కాపు కల్యాణ మండపంలో వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వాస్పత్రి చైర్మన్ కొండలరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చి ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్య సేవలను అందించి, ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వడుపు గంగాభవాని, ఊర శ్రీవాణి, లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఊర కిషోర్‌కుమార్, మున్సిపల్ ఏఈ జన్ను రాజేష్, ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

సీఐ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

గన్నవరం: గన్నవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కేవీఎస్‌వీ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేపట్టిన బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న సీఐ పి.కనకరావును ఏలూరు రేంజ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో సీఐగా నియమితులైన కేవీఎస్‌వీ ప్రసాద్ కనకరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్‌ను సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.